# ఇద్దరు అమ్మాయిలు - ఒక నల్లనివాడు

ఆ ఇద్దరు అమ్మాయిల జీవితాలలో విధి ఆటలాడుకున్నదని చాలామంది అనుకున్నారు. మొదట్లో ఆ ఇద్దరు అమ్మాయిలు కూడా అలాగే అనుకున్నారు. కానీ క్రమంగా కొంతకాలం గడిచిన తర్వాత భర్త దగ్గరగా లేని స్వేచ్ఛ అనేది అనుభవంలోకి వచ్చిన తర్వాత ఆ స్వేచ్ఛా జీవితమే బాగా బాగున్నట్టుగా అనిపించింది.

ఎలాగంటే - ఆ ఇద్దరు అమ్మాయిలకీ పెళ్లి వయసు వచ్చీరాగానే కుటుంబాన్ని చుట్టుకున్న పేదరికం కారణంగా ఆ తండ్రి తన బాధ్యత వదిలించుకోటానికి తన పేదరికానికి తగిన సంబంధాలు చూసి కూతుళ్ల పెళ్లిళ్లు జరిపించాడు.

అప్పటికి కొంచెం చిన్నవాళ్లు కాబట్టి తండ్రి మాటకు ఎదురుచెప్పలేక కుటుంబ పరిస్థితులను దృష్టిలో వుంచుకుని ఎవడో ఒకడు మొగుడుగా దొరికాడనుకొని తాళి కట్టించుకున్నారు.

ఒకరిద్దరు పిల్లలు పుట్టిన తర్వాత వాళ్లకి తమ భర్త బాధ్యతారాహిత్యం, శారీరక సుఖాల పట్ల ఆరాటం, భార్యలుగా తమ హక్కుల పట్ల పోరాటం మొదలయినాయి. కానీ వాళ్ల భర్తలు మరీ మొండివాళ్లు. వాళ్ల ఇష్టాలను, సుఖాలను వాళ్లు వదులుకోలేదు. భార్యల సుఖం గురించి పట్టించుకోలేదు. ఆడదానివల్ల వాళ్లకి వున్న అభిప్రాయం అటువంటిది.

ఇద్దరమ్మాయిలూ ఎంతో కొంత చదువుకున్నవాళ్లు. చదువుకుంటే లోకాన్ని చూసి తెలుసుకున్న జ్ఞానం మరీ ఎక్కువ. అందువల్ల అప్పుడు వాళ్లు తాము కోల్పోతున్న సుఖాల గురించి, తమ భర్తలు సరిగా ఉపయోగించుకోలేని తమ వయసు గురించి, కరిగిపోతున్న యవ్వనం గురించి అదేపనిగా ఆలోచించి ఆందోళనకు గురిఅయినారు.

సరిగ్గా వాళ్లు ఇలా ఆందోళన పడుతున్న సమయంలో తండ్రి హఠాత్తుగా అనారోగ్యంతో ఈ లోకాన్ని వదిలిపోయాడు. తల్లి వంటరిదయ్యింది. తల్లి వొంటరితనాన్నీ ఆసరాగా చేసుకుని తమ పిల్లలను తీసుకుని మొగుళ్లని వదిలి తల్లిదగ్గరకు చేరారు. అందుకు ఆ మొగుళ్లు ఏమాత్రం బాధపడలేదు. పైగా దరిద్రం వదిలించుకుని సంతోషంచారు కూడా.

పుట్టింటికి చేరిన ఇద్దరు అమ్మాయిలూ కుటుంబ పోషణ భారాన్ని చేపట్టి

అప్పటికప్పుడే తమ చదువులకు తగిన ఉద్యోగాలను సంపాదించారు. భర్తల విచారణకు గురిఅయిన ఆడవాళ్లు కాబట్టి పరాయి మగవాళ్లతో చాలా చనువుగా, చొరవగా మాట్లాడేవాళ్లు.... మగవాళ్లతో మాట్లాడుతున్నప్పుడు వాళ్లపట్ల అత్యంత ఇష్టాన్ని కనబరిచేవారు. అందువల్ల వాళ్లకు కోరుకున్నంతనే ఉద్యోగాలు దొరకడం ఏమంత కష్టం కాలేదు.

ఇద్దరు అమ్మాయిల్లో పెద్ద అమ్మాయి శమంత తన పేదరికం బయటపడకుండా నాటకం ఆడుతూ వుండేది.... కానీ రెండో అమ్మాయి హేమంత పేదరికాన్ని వంటికి చుట్టుకుని ప్రదర్శిస్తూ వుండేది. ఎలా వున్నా తను మంచి వయసులో వున్నాననే ధీమా ఎక్కువ. ఆమె ప్రతి నిమిషం తన వయసును గుర్తుచేసుకుంటూ వుంటుంది. అంతేగానీ తను అనుభవిస్తున్న సారహీనమైన గాలిపాటు జీవితం గురించి కొంచెం కూడా ఆలోచించదు.

వయసురో ఉన్నారు కాబట్టి - నిజానికి ఇద్దరూ అందమైనవాళ్లు అవకపోయినా, ఏ మగాడయినా వయసులో ఉన్న ఆడదానికి లోబడిపోతాడని వాళ్లు మెరిసే కళ్లతో అకర్షిస్తూ, ఎదుటివాళ్లను ఆహ్వానిస్తున్నట్టుగా వుండే ఆత్మీయతాపూర్వక మాటలతో మగవాళ్లను ఆకట్టుకునేవాళ్లు.

పైకి అమాయకంగా కనపడే శమంత వయసులో కొంచెం తనకు ఈడుగా కనబడే మగాళ్లతో హొయలు వొలుకుతూ, వగలుపోతూ మాట్లాడేది. చాతీ విరుచుకుని నడిచి చూపించేది. తెచ్చిపెట్టుకున్న చలాకీతనాన్ని చాలా సహజంగా ప్రవర్తించేది. మగాళ్లను తన చుట్టూ తిప్పుకోవడానికి ఆమె దగ్గర చాలా ట్రిక్కులున్నాయి.

ఒకసారి శమంత ఆఫీసులో వున్నప్పుడు సుందరరావనేవాడు ఒకడు వచ్చాడు. వాడు భలే నల్లగా వున్నాడు. కానీ ఎవడో ఒక మగాడికోసం తపించిపోయే ఆడవాళ్లను ఆకర్షించగలిగిన పర్సనాలిటీ కలిగి - టక్ చేసుకుని - ఎడమచేతికి వెడల్పాటి గోల్డుకలరు గడియారాన్ని పెట్టుకుని చేతిలో ఫైలు లాంటిది పట్టుకుని - ఒక బిజినెస్ ఎగ్జిక్యూటివ్ మాదిరిగా హుందాతనాన్ని మరచిపోకుండా ప్రదర్శిస్తున్నాడు. వాడిని చూడడంతోనే శమంతకు కళ్లు మిలమిలా మెరిసి నోట్లో నీళ్లు ఊరాయి.

వాడు తనని పరిచయం చేసుకుని తను వచ్చిన పని గురించి చెప్పాడు.

"మనీ సర్క్యులేషన్ స్కీమా?" ఆశ్చర్యపడుతున్న దానిలా కళ్లను గిర్రున

తిప్పుతూ కొంచెం యాక్టింగ్ చేస్తూ అడిగింది శమంత.

"అవును మేడమ్! ఈ స్కీమ్‌లో చేరితే కేవలం మూడు నెలల్లో మీరు యాభైవేల రూపాయలకు పైగా సంపాదించవచ్చు. దీన్ని మీరొక అదృష్టంగా భావించక తప్పదు...." అన్నాడు సుందరరావు కొంచెం స్టయిల్‌గా నవ్వి.

అప్పుడు శమంతి రూలుప్రకారం ఛాతీని ముందుకు విరిచి కుర్చీలో ముందుకు వంగి ఆ స్కీము గురించి కూలంకషంగా తెలుసుకోవాలనే క్యూరియాసిటీని కళ్లలో కనబరిచింది.

సుందరరావు తనలో తానే నవ్వుకున్నాడు. సరయిన పోషకాహారం లేక ఎటువంటి మెరుపూ లేక పాలిపోయిన ఆమె శరీరాన్ని చూస్తుంటేనే తెలుస్తోంది శమంత స్థితి ఏమిటో.... ఈ టైపు అమ్మాయిల్ని సుందరరావు చాలా సులభంగా గుర్తిస్తాడు. ఈ విషయంలో అతనికి మంచి అనుభవం వుంది.

అందువల్ల అతను "ఇక్కడే చెప్పమంటారా?...." అనడిగాడు మరో రకంగా నవ్వి గుసగుసలాడుతున్నట్టు.

అతను అలా అడగటంలోని ఆంతర్యాన్ని గ్రహించి అవకాశాన్ని వదులుకోకూడదని నిర్ణయించుకున్నదానిలా శమంత వెంటనే –

"రాత్రి ఎనిమిది గంటలకు మా ఇంటికి రండి. అక్కడ మాట్లాడుకుందాం. ప్రస్తుతం ఆఫీసు పనిలో బిజీగా వున్నాను" అని తన ఇంటి ఎడ్రసు చెప్పింది.

ఇంట్లో అయితే కొంచెం ఎక్కువగా వగలు కురిపించి సుందరరావుని సంతోషపెట్టవచ్చు. వయసులో ఉన్నాడు కాబట్టి. మనీ బిజినెస్‌లో వున్నందున ఎందుకయినా పనికివస్తాడు.

సుందరరావు కూడా అందుకు సమ్మతించాడు. అప్పుడు కూడా తన సెల్‌ఫోన్ నెంబరు చెప్పి ఇంటికి రాబోయేముందు అతన్ని ఫోన్ చెయ్యమని చెప్పింది.

సుందరరావు, శమంత కళ్లలోకి చూసి చిలిపిగా నవ్వి వెళ్లిపోయాడు.

శమంత సాయంత్రం ఇంటికి తిరిగివస్తూ వాళ్ల ఇంటి రోడ్డు మలుపులో ఉన్న బడ్డీకొట్టులో గాజుసీసాల్లో వున్న ఇక్ష్వాకుల కాలంనాటి బూందీ, బూజుపట్టిన రెండు మైసూరుపాకు ముక్కలనూ సుందరరావుకోసం కొని తీసుకువచ్చింది.

రావటంతోనే – చినిగిపోయిన చాపమీద పడుకుని తనతో ఇంతకుముందు తిరిగిన రకరకాల వయసున్న మగవాళ్ల గురించి ఆలోచిస్తున్న చెల్లెలు హేమంతకు సుందరరావు గురించి చెప్పింది శమంత.

అతని గురించి చెప్పగానే మగ గాలికి దూరమయి ప్రస్తుతం ఖాళీగా వున్న హేమంతకు కూడా నోట్లో నీళ్లు ఊరాయి.

"రంగుదేముందిలే అక్కా!.... శరీరం ముఖ్యంకానీ" అన్నది హేమంత. సుందరరావు నల్లగా వుంటాడని శమంత చెప్పినప్పుడు.

"ఈ డ్రస్సు మార్చుకో.... అతను చూస్తే బావుండదు. కొంచెం రిచ్‌గా కనపడాలి" అన్నది శమంత.

"నాకు అన్నీ ఇలాంటి డ్రస్‌లే ఉన్నాయి"

"ఉన్నవాటిల్లో కొంచెం బెటర్‌గా వున్నది వేసుకో.... బ్రా వేసుకోవడం మరచిపోకు. ఆ సుందరరావు మంచి ఆర్టిస్టులాగా వున్నాడు. పట్టిపట్టి చూస్తున్నాడు. అతడి నవ్వు భలే అందంగా వుంటుంది" అన్నది శమంత.

ఈసారి హేమంతకు నోట్లో నిజంగానే నీళ్లు ఊరాయి.

చెప్పినట్టుగానే రాత్రి ఎనిమిదిగంటలు కావస్తున్నప్పుడు మరింత అందంగా ముస్తాబయి చిరునవ్వు చిందిస్తూ వచ్చాడు సుందరరావు. శమంత-హేమంత అతడిని సాదరంగా ఆహ్వానించి ఒక కుర్చీలో కూర్చోబెట్టారు.

శమంత తన ఫ్రెండంటూ సుందరరావుని హేమంతకి, హేమంతని సుందరరావుకి పరిచయం చేసింది.

కూతుళ్ల సుఖానికి ఏ విధంగానూ అడ్డురాని తల్లి వంటింట్లో ఒక మూల కూర్చుని కునికిపాట్లు పడుతోంది.

తర్వాత హేమంత క్రీస్తుపూర్వంనాటి ఆ రాటుతేలిన బూందీని, బూజుతో నిండిన ఆ రెండు మైసూరుపాకు ముక్కలనీ గుంటలుపడిన ఒక ప్లేటులో వుంచి, అందులో ఒక మెలితిరిగిన చెంచాను వేసి సుందరరావుకి ఇచ్చింది.

సుందరరావు ఆ కాలం చెల్లిన బూందీని చప్పుడు చేస్తూ తింటూ కొంచెం తెలివిగా వాళ్ల భర్తల గురించి అడిగాడు.

ఏమని చెప్పాలో తెలీక కంగారుపడుతూ వాళ్లు తమ స్వంత ఊళ్లో వ్యవసాయం చేస్తున్నట్టుగా నమ్మబలికారు. సుందరరావు నమ్మినట్టు నటించాడు కానీ నమ్మలేదు. తన పని మరింత సులభమవుతున్నందుకు లోలోపల బాగా సంతోషించాడు. వాళ్లిద్దరూ మొగుళ్లకు దూరంగా వుంటున్న రకాలని సులభంగా అర్థం చేసుకున్నాడు.

మనీ సర్క్యులేషన్ స్కీము గురించి వాళ్లిద్దరికీ వివరంగా చెప్పి సుందరరావు తిరిగివెళుతున్నప్పుడు "అప్పుడప్పుడు వస్తూ వుండండి" అని చెప్పింది హేమంత. ఎందుకంటే సుందరరావు శరీర కొలతలు హేమంతకు బాగా నచ్చాయి. కొంచెం ఎత్తుగా, లావుగా మగవాళ్లంటే హేమంత పడిచస్తుంది.

ఆ ఆహ్వానాన్ని వదులుకోకుండా సుందరరావు వారంరోజుల్లోనే ఇంకోసారి వచ్చాడు. అప్పుడు శమంత ఇంట్లో లేదు. తల్లికూడా .......... ఆమె ఇంట్లో సరిగా ఉండదు. ఆ వీధిలో వున్న ఇళ్లన్నీ తిరుగుతూ విషయ సేకరణచేసి ...... వుంటుంది. ఆమెకు అదొక కాలక్షేపం. కూతురుకోసం ఇంటికి ఏ మగాడు వచ్చినా ఆమె అభ్యంతరం లేదు. ఎందుకంటే ఆమె అన్నివేళలా కూతుళ్ల సుఖాన్నే కోరుకుంటుంది.

పిల్లలు ట్యూషన్లకు వెళ్లారు.

"అయామ్ లక్కీ" అన్నాడు సుందరరావు వెకిలిగా నవ్వుతూ.

"ఎందుకు?" అనడిగింది శమంత.

"ఎందుకేమిటి? భలే సమయంలో వచ్చాను. ముఖ్యంగా మీ అక్కయ్య ఇంట్లో లేదు. వివరంగా చెప్పాలంటే మీ అక్కయ్యకంటే మీరే అందంగా వుంటారు. ఆమె నాకు అంతగా నచ్చదు. బాడీ సేపు బావుంటుంది. మీలాంటి బాడీ స్ట్రక్చర్ వున్నవాళ్లు చాలా అరుదుగా వుంటారు. మీతో మాట్లాడుతుంటే నాకు సమయం ఎంత గడిచిందో తెలీదు" అన్నాడు సుందరరావు వంగిరి వంగిరిగా.

హేమంత సిగ్గుతో మెలికలు తిరిగి అతడికి థ్యాంక్స్ చెప్పింది. ఆమెలో ఒక ముఖ్యమైన బలహీనత వుంది. అదేమిటంటే - ఎవరయినా మగాడు తన అందాన్ని పొగిడితే వారిని తనకు తెలీకపోయినా వారికి తన సర్వస్వాన్ని అర్పించడానికి అప్పటికప్పుడు సిద్ధమవుతుంది. నిజానికి తను అందంగా లేకపోయినా తను చాలా అందంగా వుంటుందనీ, తన వయసువల్ల తన అందం ఇనుమడించినదనీ, ఎంత వెధవయినా తన అందం ఆకర్షిస్తుందనీ దానికో గుడ్డి నమ్మకం. అప్పటికప్పుడు అవసరం లేకపోయినా అతని సెల్‌ఫోన్ అడిగి తీసుకుని ఎవరికో రింగ్‌చేసి "ఇప్పుడు మీరెక్కడ వున్నారు? నన్నెప్పుడు కలవమంటారు. మరి వుండనా?" అని ఫోన్‌ని సుందరరావుకు తిరిగిఇచ్చింది. తనకు చాలా డిమాండ్ వున్నదని సుందరరావు అనుకోవాలని హేమంత భావన.

తర్వాత అతనికి హేమంత ఎండిపోయిన యాపిల్‌ని ముక్కలు కోసి ఇచ్చి టీ పెట్టి దగ్గరుండి తాగించింది.... సుందరరావు మూతి తుడుచుకుని హేమంతకు

థాంక్స్ చెప్పాడు. అనవసరంగా హేమంత - సుందరరావు చేతులను కొన్నిసార్లు తాకి వదిలింది.

సుందరరావు చాలా తెలివిగా పనికిమాలిన కబుర్లు చెబుతూ రాత్రి పదిగంటలవరకూ గడిపారు. తర్వాత అప్పుడే స్పృహలోకి వచ్చినవాడిలా గడియారాన్ని చూసుకుని -

"వావ్! అప్పుడే పదయ్యిందా? టైమే తెలీలేదు. ఇప్పుడు మా వూరికి వెళ్లటానికి బస్సు కూడా వుండదు.... మీరు ఎదురుగా వుంటే నాకేమీ గుర్తుండదు. ఇక ఇక్కడే భోజనం చేసి మీతో సరదాగా కబుర్లు చెబుతూ ఈ రాత్రి ఇక్కడే పడుకుంటాను" అన్నాడు హేమంత చొరవకు పరీక్ష పెడుతూ.

అప్పుడు హేమంత "ఇంట్లో అంత కన్వీనియంట్‌గా వుండదు. ఏదయినా హొటలులో అయితే బావుంటుంది" అన్నది చిన్నగా తల వంచుకుని నేలచూపులు చూస్తూ.

"ఐతే ఒక షరతు" అన్నాడు సుందరరావు.

"ఏమిటి?" క్యూరియస్‌గా అడిగింది.

"హొటల్ రూములో నా ఒక్కడికి బోర్ కొడుతుంది. మీరు కంపెనీ ఇవ్వాలి" అన్నాడు తమాషాగా నవ్వి.

"ఇప్పుడు అమ్మకు ఇంట్లో ఏం చెబుతాను?" అన్నది హేమంత అస్పష్టంగా.

"ఇప్పుడు అవసరం లేదు.... మరోసారి చూద్దాం. ఏర్పాటుచేసి చెబుతాను. సిద్ధంగా వుండండి.... మీతో గడపటం అంటే నాకు స్వర్గంతో సమానం" అన్నాడు సుందరరావు.

అప్పుడు హేమంతకు లోపలకు లాక్కుపోయిన బుగ్గలు ఎర్రబడి నెత్తిమీద వెంట్రుకలు కొన్ని లేచి నిలబడి గాలిలో నాట్యం చేశాయి. ఒంట్లో వున్న కొద్దిపాటి రక్తం పెదవుల్లోకి తన్నుకువచ్చి తల వంచుకుని సుందరరావుతో హొటలు గదిలో గడపటానికి అంగీకార సూచకంగా తల వూపింది.

వెంటనే సుందరరావు ఆమెకు థ్యాంక్స్ చెప్పి లేచి నిలబడి హేమంత కుడిచేతిని తన చేతిలోకి తీసుకుని పట్టుకుని శాంపిల్‌గా ఫారెవర్‌కు లాగా హేమంత చేతిమీద చప్పుడు చేస్తూ ముద్దు పెట్టుకుని ఆమె కళ్లలోకి చూసి కొంటెగా నవ్వి వెళ్లిపోయాడు.

తర్వాత మరొకరోజు శమంతను కాఫీ తాగే నెపంతో హొటల్లుకు తీసుకువెళ్లి ఆమెకు లేని అందాన్ని స్తుతించి తన మనసును ఆమె లాగేసుకున్నదని చెప్పి స్కీము లాభం పేరుతో ఐదువందల రూపాయలను ఆమె చేతిలో పెట్టి శమంత కూడా ఏదో ఒకరోజు తనతో ఒక హొటలు గదిలో ఏకాంతంగా గడిపే అంగీకారాన్ని పొంది వెళ్లిపోయాడు. శమంత ఆ రాత్రి నిద్రకు దూరమయ్యింది.

సుందరరావు తను మాట ఇచ్చినట్టుగానే ఒక హొటల్లో రూమ్ బుక్‌చేసి వేర్వేరు రోజుల్లో శమంతనీ, హేమంతనీ ఫోన్‌చేసి పిలిచాడు. ఇద్దరూ ఒకరికి తెలియకుండా ఒకరు వెళ్లి సుందరరావుతో గడిపి చాలాకాలం తర్వాత మగాడితో శయనసుఖాన్ని పొంది వచ్చారు.

❖ ❖ ❖

రెండు నెలలు గడిచి మూడో నెల నడుస్తోంది.

ఒక గంట వ్యవధిలో శమంత–హేమంత తమకు బాగా తెలిసిన లేడీ డాక్టరు దగ్గరకు వెళ్లి తమ అనుమానాన్ని నివృత్తి చేసుకుని వచ్చారు.

ఇద్దరూ కడుపుతో ఉన్నారని స్పష్టం చేసింది ఆ లేడీ డాక్టరు.

ఈ లోపల సుందరరావు స్కీము లాభం పేరుతో శమంతకీ, హేమంతకీ చెరొక ఐదువందల రూపాయలనీ ముట్టచెప్పాడు.

కడుపు విషయం తెలిసిన తర్వాత ఇద్దరు అమ్మాయిలూ కొంచెం కలవరపడ్డారు. భర్తలకు దూరంగా వుంటున్నారు కాబట్టి కడుపువల్ల అంతా తమ శీలాన్ని శంకిస్తారు. అదీ వాళ్ల భయం. ఇలా భయపడి వాళ్లిద్దరూ సుందరరావుకు ఫోన్‌చేసి తమ కడుపుల విషయం చెప్పి పరిష్కారం చెప్పమని అడిగారు.

అప్పుడు ఆ నల్లనివాడు చాలా తేలిగ్గా నవ్వి.

"ఆడవాళ్లకి ఇలాంటి కడుపులు చాలా సహజంగా వస్తూవుంటాయి. ఐనా కంగారుపడవలసిన అవసరం ఏమీ లేదు. ఈసారి వచ్చే స్కీము లాభంతో ఇద్దరూ హాయిగా అబార్షన్లు చేయించుకోండి. ఈసారి ఏ.సి. హొటల్లో గది బుక్ చేస్తాను" అని చెప్పాడు.

మళ్లీ ఇంకోసారి ఆ ఇద్దరు అమ్మాయిల జీవితాలతో విధి ఆటలాడుకుంది. అయితే ఈసారి ఈ ఆట గురించి ఆ ఇద్దరు అమ్మాయిలకీ, ఆ నల్లనివాడికీ తప్ప ఇంకెవరికీ తెలీదు.

వాళ్లిద్దరూ స్కీము లాభం గురించి ఎదురుచూస్తున్నారు. ❖

*మల్లెతీగ మాసపత్రిక, నవంబర్ 2008*